క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు ఆర్టీసీకి సంబంధించి డిపో పరిధిలో సమస్యలను 9959226286 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

పనులు ప్రారంభం

నవాబుపేట: కొల్లూర్‌లో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి సీసీ రోడ్ల కోసం రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తులసీరాంనాయక్, ఖాజా, నర్సింహచారీ, కృష్ణ, వెంకటయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రాజాపూర్: కల్లేపల్లికి చెందిన మాజీ సర్పంచ్ బాలమణి భర్త చిన్న శ్రీశైలంయాదవ్‌తో పాటు అగ్రహారం పొట్లపల్లి మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ సొంతగూటికి చేరారు. బుధవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యం

దేవరకద్ర రూరల్: ఆర్థికాభివృద్ధి సాధనలో భాగంగా.. ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యమని ఎస్‌బీఐ మేనేజర్ శ్రీధర్ అన్నారు. బుధవారం కౌకుంట్ల మండల కేంద్రంలో ఆధ్వర్యంలో సీఎఫ్ఎల్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రంను ప్రారంభించారు. సిబ్బంది శ్రీనివాసులు, కృష్ణ, తిరుపతమ్మ, బాస్కర్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గణితంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

గండేడ్: గణితంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏఎంఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రుసుంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు జీవన్, కీర్తి గణితంలో చక్కగా రాణిస్తుండడంపై అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. సృజనాత్మకత పెంపొందే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరుకాని వారికి రిమాండ్

మహమ్మదాబాద్: వేరువేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులు కోర్టుకు హాజరు కానందున వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వారి కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వివధ కేసుల్లో ఉంటూ కోర్టులు ఇచ్చిన తేదీల ప్రకారం కోర్టుకు హాజరు కావాల్సి ఉన్నది. కాగా వారు హాజరుకాకుండా నిర్లక్ష్యం చేశారు. పలుమార్లు సమన్లు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో బుధవారం రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

మహమ్మదాబాద్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మండలపరిధిలో చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన వడ్డె అంజమ్మ, రాజు దంపతుల మధ్య ఈనెల 26న కుటుంబ సంబంధ విషయంలో గొడవ జరిగింది. దీంతో అంజమ్మ ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయింది. ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి వివరించారు.

ఎంవీఎస్‌లో సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు అనే అంశంపై ఒక్కరోజు సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్జేడీ యాదగిరి హాజరై ప్రసంగించారు. అర్థశాస్త్రం మానవ జీవితంతో మిళితమైందని, దాన్ని అర్థం చేసుకుంటే విద్యార్థులకు గొప్ప అవకాశాలు లభిస్తాయన్నారు. అధ్యాపకుడు గులామ్‌హుస్సేన్, ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడు రాఘవేందర్‌రెడ్డి గ్రూప్–1, 2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా ఎంవీఎస్ పబ్లికేషన్స్ పేరు మీద ప్రస్తు కరెంట్ ఎఫైర్స్ ను ఈనెల నుంచి మాసపత్రిక రూపంలో ప్రచురించనున్నారు. స్టడీ మెటీరియల్‌ను ఆర్జేడీ యాదగిరి ఆవిష్కరించారు.

మొక్కలను సంరక్షించాలి

కోయిల్‌కొండ: మండలంలో నాటిన మొక్కల సంరక్షించాలని ఎంపీడీఓ కాళప్ప అన్నారు. బుధవారం రాంపూర్‌లోని నర్సరీని, హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. నాటిన మొక్కలకు గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా నిత్యం నీటి సరఫరా చేయాలన్నారు.

గెలుపే ధ్యేయం

హన్వాడ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిద్దామని జిల్లా కార్యదర్శి కృష్ణయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కృష్ణయ్యయాదవ్‌ను జిల్లా కమిటీలో కార్యదర్శిగా నియమించడంతో పలువురు నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

సైన్స్‌తోనే భవిష్యత్

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్‌దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలు తయారు చేసి ప్రదర్శనలు నిర్వహించారు.

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్, అధ్యాపకులు ముంతాజ్ జహాన్, సురయా జబీన్, కేశవర్ధన్‌గౌడ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. కరస్పాండెంట్ ఫణిప్రసాద్, డైరెక్టర్ ఇబ్రహీం ఖలీల్, ప్రిన్సిపాల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ రవికుమార్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకుడు గురురాఘువేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ రవీందర్ హాజరై ప్రసంగించారు. మున్సిపాల్ చైర్మన్ ఆనందకుమార్, పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

- చిన్నచింతకుంట మండలం లాల్‌కోట ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, గంగయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు 50 రకాల సైన్స్ ప్రయోగ నమూనాలను తయారుచేసి వాటి పనితీరును గురించి గ్రామస్తులకు వివరించారు. హెచ్ఎం మురళీకృష్ణ, లక్ష్మీకాంత్, విజయ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్ల పరిధిలోని పలు పాఠశాలల్లో సైన్స్‌ఫేర్‌లు నిర్వహించారు. కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో 70కి పైగా ప్రయోగాల నమూనాలను విద్యార్థులు ప్రదర్శించినట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలియజేశారు. స్వామినారాయణ గురుకుల్‌లోనూ కార్యక్రమం చేపట్టారు. డైరెక్టర్ భావిష్, ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేట పరిధిలోని ఇప్పటూర్, కొత్తపల్లి, మరికల్, నవాబుపేట, మరికల్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో కార్యక్రమం చేపట్టారు.
- దేవరకద్ర మండలం గూరకొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్ఎం రాధికా రాణి, ఉపాధ్యాయులు చంద్రకళ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలోని న్యూరిషిలో తాము చేసిన సైన్స్ నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థులు


స్వామినారాయణ గురుకుల్‌లో..

మౌంట్‌బాసిల్‌లో



జిల్లా కేంద్రంలోని మౌంట్‌బాసిల్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వీటితో పాటు క్విజ్, సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించిగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. యాజమాన్య సభ్యులు చంద్రకళావెంకటయ్య, శిరీష్‌ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ, పూజితామోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేష్, సౌమ్య పాల్గొన్నారు.

న్యూరిషిలో..

జిల్లా కేంద్రం రాజేంద్రనగర్‌లోని న్యూరిషి హైస్కూల్, బాయమ్మతోటలోని న్యూరిషి పాఠశాలల్లో బుధవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ చంద్రకళ వెంకటయ్య హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డైరెక్టర్‌లు శిరీష ప్రవీణ్, పూజితామోహన్ రెడ్డి, సుశాంత్‌కృష్ణ, మాధవీలత కృష్ణ విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి, అభినందించారు. ప్రిన్సిపాళ్లు వెంకటరమణ, రామకృష్ణ, సిబ్బంది నగిత, విజయ్, సుజత, శాంతికుమార్, హర్షిత, శోభ, తదితరులు పాల్గొన్నారు.


నవాబుపేటలో..


లాల్‌కోటలో..


కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో..


శ్రీచైతన్య పాఠశాలలో..


గూరకొండలో..

క్యాలెండర్ ఆవిష్కరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ సమాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన తొలి తెలుగు కవయిత్రి మొల్ల క్యాలెండర్లను బుధవారం జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలో ఆమె విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ మొల్ల రాసిన రామాయణం మిక్కిలి ప్రసిద్ధి చెందిందన్నారు. కోకన్వీనర్ సవారి సత్యం, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, గౌరవాధ్యక్షుడు రాంచంద్రయ్య, ఉపాధ్యక్షులు మల్లేష్, ఆంజనేయులు, నాగప్ప, మాసయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



మహబూబ్‌నగర్ రూరల్: కోటకదిర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం హరినాథ్, ఉపాధ్యాయులు విద్యార్థి ఉపాధ్యాయులు పాఠాలు బోధించిన తీరు పరిశీలించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

రాజాపూర్: చొక్కంపేట్‌లో నూతనంగా నిర్మించిన ఉమారామలింగేశ్వర శివాలయంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం దోండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి దంపతులు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మాజీ సర్పంచ్‌లు గిరిధర్‌రెడ్డి, జయమాలరెడ్డి తల్లి రేణుకాదేవి పేరుతో నిర్మించిన కల్యాణమండపాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మురళీధర్‌రెడ్డి, వీరాదేవి, నిషితారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్య, సేవ్యానాయక్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థి ప్రతిభ



దేవరకద్ర రూరల్: రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో డోకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.సాయి చరణ్ ప్రతిభచాటి తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. ఈ నెల 12న నిర్వహించిన పోటీల్లో పర్యావరణ పరిరక్షణ– ప్లాస్టిక్ రహిత ప్రపంచం అంశంపై ఉత్తమ ప్రతిభ కనబర్చిన అతడు పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణీ ప్రసాద్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంస పత్రం, బహుమతి, నగదు అందుకున్నాడు. హెచ్ఎం బలరాం, ఉపాధ్యాయురాలు చందన పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకద్ర రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసునమోదు చేసిన ఘటన బుధవారం దేవరకద్రలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్ కథనం ప్రకారం.. కౌకుంట్ల మండలంలోని పుట్టపల్లి సమీపంలోని వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. బుధవారం రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

సాగులో జాగ్రత్తలు అవసరం

కోయిల్‌కొండ: రైతులు వరిసాగులో జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని వ్యవసాయాధికారి రాంపాల్ అన్నారు. బుధవారం రాంపూర్‌లో వరిసాగును పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఏఈఓ కొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి..

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల నుంచి శ్రీశైలానికి శివభక్తులు పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం పూజారి మఠం సురేష్ అధ్వర్యంలో స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించి అనంతరం పాదయాత్ర చేపట్టారు. అంతకుముందు గ్రామంలో కీర్తనలను ఆలపిస్తూ ఊరేగింపు చేపట్టారు.

గోవుల తరలింపు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మపూరం కురుమూర్తి స్వామి ఆలయంలో భక్తులు కానుకలుగా సమర్పించిన గోవులను బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి గోశాలకు ఆటోలో తరలించారు. ఈసందర్భంగా ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీకర్ మాట్లాడుతూ గోవుల సంరక్షణకే గోశాలకు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజలకు వారధిగా నిలవాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

జడ్చర్ల టౌన్: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు వారధిలా నిలవాలని.. అభివృద్ధికి పాటుపడాలని జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్నందున ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు.

31లోగా పన్నులు వసూలు చేయాలి

మార్చి 31లోగా 100శాతం పన్నులు వసూలు చేయాలని డీపీఓ వెంకటేశ్వర్లు సూచించారు. వసూలు వేగవంతం చేయాలని, ప్రతి గ్రామపంచాయతీలో 100శాతం పన్నులు వసూలు చేయాల్సిందేనన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవిచంద్ర, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎంపీఓ జగదీశ్, ఏఈ జవహర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజమిల్, మొగులాల్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప అఖండ భజన


మాట్లాడుతున్నరాజ్‌దేశ్‌పాండే

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కొత్తగంజ్ బ్రిడ్జి పక్కన నీలకంఠస్వామి ఆలయంలో 50వ ఇంటింటా భజన–మన ఇంట్లో భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఉదయం 5 గంటలకు కాషాయ ధ్వజారోహణ, గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, 6 గంటలకు నీగానమే నా ప్రాణం అఖండ భజనను ప్రారంభించగా సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. అనంతరం అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే, జాతీయ కార్యదర్శి ప్రేమ్ గాంధీ, రాష్ట్ర కార్యదర్శి హరినారాయణ్, జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నాయకులు శాంతికుమార్, మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

జడ్చర్ల టౌన్: ఆరుగ్యారెంటీల్లో ప్రధానమైన రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయటం పట్ల పట్టణ మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పట్టణ అధ్యక్షురాలు అనితరెడ్డి, స్వప్న, రాధిక, అరవింద పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భీమకవి వసంత అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలకు శ్రీకారం చుట్టినందుకు జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, నవనీత, మహేశ్వరి, అమిత, సహజ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి



పాలమూరు: జిల్లాలో నేటి నుంచి మార్చి 3వరకు సంపర్క్ అభియాన్ కార్యక్రమంతో భాగంగా కేంద్ర పథకాల నుంచి లబ్ధిపొందిన ప్రతి ఇంటికి బీజేపీ నేతలు, కార్యకర్తలు వెళ్లాలని జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా కార్యాలయంలో బుధవారం శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు.

దేవరకద్ర: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం చేసుకుని కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కుర్వ రమేశ్ కోరారు. బుధవారం దేవరకద్రలో ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. యజ్ఞ భూపాల్‌రెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రతీ భారతీయున్ని ధనవంతులుగా చేయడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌గౌడ్, వెన్నె ఈశ్వరప్ప అన్నారు. బుధవారం ఉమ్మడి మండలాల ఓబీసీ మోర్చ సామాజిక సమ్మేళనం మహమ్మదాబాద్‌లో ఏర్పాటు చేయగా పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, మండలాల అధ్యక్షులు ప్రభు నాయక్, కుర్వకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదువుకోవాలి



అడ్డాకుల: విద్యార్థులు ఏకాగ్రత పెంచుకుని ఒత్తిడికి లోనవకుండా చదువుకోవాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. భూత్పూర్ మండల కేంద్రంలో అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఇంపాక్ట్ సంస్థ ద్వారా ఏర్పాటు చేయించిన ప్రేరణ తరగతుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని చేరుకునే విధంగా ముందుకు సాగాలని చెప్పారు. ఇంటర్నేషనల్ మోటివేటర్ గంప నాగేశ్వర్‌రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, ఊషన్న, లాలూనాయక్, హార్యానాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి ఉర్సు


విద్యుత్ దీపాల అలంకరణలో దర్గా

చిన్నచింతకుంట: అప్పంపల్లి అబ్దుల్ రహమాన్ (మాసన్న) ఉర్సు గురువారం నుంచి ప్రారంభం కానునుంది. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యంలో తరలి వస్తుంటారు. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే దర్గాకు రంగులు అద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతి ఏర్పాట్లు, మంచినీరు, పారిశుద్ధ్యం పనులు చేపట్టారు.

కాగా 29న దర్గా నిర్వాహకులు జి శంకర్ ఇంటి నుంచి వైభవంగా గంధంను ఊరేగింపు చేపట్టనున్నారు. మార్చి 1న శుక్రవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేరోజు ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 2న దివ్య ఖురాన్ పఠనం చేస్తారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేపట్టనున్నారు. వేడుకలకు హైదరాబాద్ సయ్యాద్ సుల్తాన్ అలీషా దర్గా పీఠాధిపతి సయ్యద్ నిజామోద్దీన్ హారుని, తాండూర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖరీంషా దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ సాబేర్ పాషా, దుప్పల్లి రాంచంద్రయ్య దర్గా పీఠాధిపతులు సుకుమార్ గౌడ్, కరుణాకర్ గౌడ్, రవి గౌడ్ హాజరు కానున్నారు.

పరీక్షలు ప్రారంభం



సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతంగా కొనసాగాయి. కాగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. పరీక్ష హాలులోకి ప్రవేశించే సమయంలో చాలా సెంటర్ల వద్ద విద్యార్థులు హడావుడిగా పరుగులు పెట్టారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు మొత్తం 214 మందికి గాను 199 మంది పరీక్షలకు హాజరైనట్లు నిర్వాహకులు రమేష్ తెలిపారు.


బాలుర కళాశాల వద్ద విద్యార్థులు


ప్రభుత్వ బాలికల కళాశాల పరీక్ష కేంద్రం వద్ద బారులుతీరిన విద్యార్థులు


బాలుర కళాశాల వద్ద పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణ పేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com